
# అసలు మనిషి

## కొచ్చెర్లకోట వెంకటసుబ్బారావు

"ఎందుకండీ మళ్ళీ రెండు రూపాయలు ఖర్చు అసలే ఖర్చు రోజుల్లో అంటూ ఆఫీసు నుండి యింటికి రాగానే నా భార్యామణి అరిగిపోయిన పాత రికార్డే ఆలపించింది

పోనీలేవే, రెండు రూపాయిలేగా నచ్చచెప్పటానికి ప్రయత్నించాను



నేను అంతగా ఆమె మాటలు పట్టించుకోను భర్తలో లోపాలు వెతికి దెప్పి పొడవటం భార్యకు ఆనంద మేమో!

నాకు పెద్ద వ్యసనాలంటూ ఏమీలేవు బీడి, సిగరెట్లు, తాగను మద్యపానం చేయటంమంటే ఏమిటో యింతవరకు తెలియదు ఇతర అలవాట్లు కూడా ఏమీ లేవు

అయితే మార్కెట్లోకి వార పత్రిక రాగానే కొని చదువుతాను కొనకుండా చదివే మార్గాలువున్నా నాకు అవి అంతగా నచ్చవు అంతసేపు నేను పత్రిక చదవకుండా వుండలేను రాత్రి బోజనం చేసిన తర్వాత విశ్రాంతిగా పడుకొని పత్రిక చదువుతుంటే నాకు అమిత ఆనందం కలుగుతూంది ఇది నాభార్య దృషిలో వ్యసనం కానీ పత్రిక చదవందే నాకు నిద్ర పట్టదు

నాకు చాలాకాలంగా ఓ కోరికవుంది రచయితలను చూడాలనీ, వారితో యిష్టాగోష్టిగా మాట్లాడాలనీ, వారి జీవన విధానంచూసి ప్రేరణ పొందాలని ఏదో పొరుగువూరులో వున్న రచయితను కల్సుకోవాలంటే డబ్బు కావాలి డబ్బు ఖర్చు అవుతుందంటే నాశ్రీమతి ససేమిరా వద్దంటుంది

అదృష్టవశాత్తు నేను వుండే వూళ్లోనే ఓ రచయిత ఉన్నట్లు తెలుసుకున్నాను ఈమధ్య ప్రతి పత్రికలోనూ అతని కథలు పడుతూ వున్నాయ్ అతని కథలు చదవి నేను ముగ్ధుడనయ్యాను సమాజంలోని దళితవర్గమంటే అతనికి ఒక ప్రత్యేకమైన శ్రద్ధ ఎంతో చిత్తశుద్ధితో రాస్తాడు మనం సమాజంలో అట్టడుగున వున్నవాళ్లపట్ల ఎంత అమానుషంగా ప్రవర్తిస్తున్నామా అని ఆలోచిస్తాను అతని రచనే నన్ను ఆలోచింపచేస్తుంది

నిన్ననే అతని మరో కద చదివాను తాలింపు శనగలమ్ముకునే ఓ కుర్రాడు కథ స్కూలుకు వెళ్లవల్సిన వయస్సు ఇంటి పరిస్థితులు బాగుండక యిల్లు యిల్లూ తిరిగి రోజుకో రూపాయో రెండు రూపాయిలో సంపాదిస్తూ వుంటాడు ఓరోజు అతను ఓ వీధిలో శనగలమ్ముతూ వుంటాడు కొందరు పిల్లలు ఆడుతూ వుండటం చూసి అతనికీ ఆడాలనిపిస్తుంది

అతడు ఆట ధ్యాసలో పడతాడు ఇంతలో కొంతమంది తుంటరి పిల్లలు అతని శనగలు తినివేస్తారు వాళ్ల అమ్మా నాన్న కొడతారని ఆ శనగలమ్ముకొనే పసివాడు ఏడుస్తూ వుంటాడు ఆ తుంటరి పిల్లలు తల్లి తండ్రులకు మొరపెట్టుకుంటాడు 'మా పిల్లలతో ఆడి మా వాళ్లకు దొంగతనం నేర్పుతున్నావు' అంటూ వాళ్లు ఆ పసివాణ్ణే కొడతారు రచయిత ఆ దృశ్యాన్ని కళ్లకు కట్టినట్లు వర్ణిస్తాడు అది చదివిన తర్వాత నా మనస్సు చలించిపోయింది ఈరోజు మా ఆఫీసు 'లంచ్ అవర్‌లో ఈ కథ గురించి ప్రస్తావన వచ్చింది అతన్ని కలవాలని అనుకున్నాను ఎలాగో అడ్రసు సంపాదించాను

చాలామంది కథలు చదువుతారు 'కామెంట్సు' పాస్ చేస్తారు కొందరు రచయిత పేరు చదువుతారు అతడ్ని గురించి అంచనా వేస్తారు అంచనా ఎప్పుడూ వూహకు సంబంధించినదే ఊహ నిజం కాకపోవచ్చు ఊహ నిజమైతే తాను ఏదో సాధించానన్నంతగా పాఠకుడు ఫీలవుతాడు.

ఉదయమే అడ్రసు వెతుక్కుంటూ నేన రచయిత యింటికి వెళ్లాను

నేన వెళ్ళేసరికి నాకంటే ముందుగానే ఒక విజిటరు వరండాలో వున్నాడు ఆ విజిటర్ని గురించి నేను అంతగా చెప్పక్కర్లేదనుకుంటాను అలాంటివాళ్లు మన దేశంలో చాలామంది వున్నారు చింకి గుడ్డలు, మాసిన గెడ్డం, అస్థిపంజరంవంటి అతని శరీరం,

అతడ్నిచూస్తే వుదయమే వచ్చినట్లు లేదు రాత్రి వరండాలో బస చేసినట్లున్నాడు ఇంత చలిలో రాత్రంతా ఎలా గడిపాడో' అని ఒక్క క్షణం ఆలోచించాను అతడ్ని నిశితంగా చూసాను అతడు ఏమి అనుకున్నాడో ఏమో, వెంటనే తన చింకి చాప సర్దాడు త్వరగా వెళ్ళటానికి వుద్యుక్తుడయ్యాడు

ఇంతలో తలుపు తెరచుకుంది రచయిత బయట కొచ్చాడు రాత్రంతా కథలు రాసి వుంటాడు వాటి ఛాయలు అతని కళ్లలో లోతుగా కనబడుతున్నాయి

రచయిత చూసిన మొదటి వ్యక్తిని నేను రెండవ వ్యక్తి నా ప్రక్కనున్న మనిషి అతని రెండు కళ్లల్లో రెండు భావాలు. ఇలా చెప్పటం తప్పయితే అతని రెండు కళ్లల్లో వేరు వేరు భావాలు నా గురించి తెల్సుకోవాల్సిన తొందర అతనికి కనబడలేదు. అందుకే అతడ్నే మొదట అడిగాడు

ఇది యిల్లా? మున్సిపాలిటీ మరుగు దొడ్డా? ఫుట్ పాత్‌లు లేవూ? ఏ బ్రిడ్జి క్రిందో పడి చావక యిక్కడ తగలపడ్డావేం? ఇది సంసారం చేసే కొంపనుకున్నావా బికారీల లాడ్జి అనుకున్నావా?"

రచయిత ప్రశ్నలకు అతను సమాధానం చెప్పలేదు. గుడ్లప్పగించి చూస్తూ వుండిపోయాడు

తాను అడిగిన ప్రశ్నలకు స్వీకారంగా కానీ తిరస్కారంగా కానీ సమాధానం లభించకపోవటంతో రచయిత సహనం కోల్పోయాడు నా వునికి అతన్ని మరింత రెచ్చగొట్టింది

నీకు చెవుడా? చెప్పేది వినబడటం లేదూ? నీకు నోరు కూడా లేదా? మాటలు రావా?" అంటూ రచయిత తన ఆక్రోశాన్ని గుమ్మరిస్తున్నాడు

రచయిత అరుపులు అతని భార్యను నిద్రలేపి నట్లున్నాయి ఆమె బయటకు వచ్చింది భర్త మనఃస్థితి అర్థం చేసుకున్నట్లుంది

పోనీ లెండి! నేను వసారా కడుగుతాను ఎందుకు బిచ్చగాడి మీద అంత కోపం" అంటూ భర్తకు నచ్చ చెప్పబోయింది

ఆమె మాటలు అతడ్ని శమన పరచలేదు

నేను యిందాకట్నుంచీ నెత్తీ నోరూ కొట్టుకుంటూ వుంటే వీడికి ఎంత నిర్లక్ష్యం? మూగ ముండా కొడుకు లాగా మాట్లాడడు! ' అంటూ అతడిపై లంఘించబోయాడు

నేను రచయితను వారించబోయాను ఇంతలో ఆమే ఆ పని చేసింది బిచ్చగాడు బిక్కమొహం పెట్టి మాటలు రావన్నట్లూ వినబడవన్నట్లూ సైగ చేస్తూ అక్కడనుంచి వెళ్లిపోయాడు ఇదంతా క్షణంలో జరిగిపోయింది నేను స్థాణువులా నిలబడి వుండిపోయాను

రచయిత మూడ్" మార్చుకొని సాదరంగా నన్ను లోనికి ఆహ్వానించాడు

'మరోసారి కలుస్తాను' అని చెప్పి బయటకు వచ్చేసాను

శతాబ్దాలుగా మానవుడు ప్రగతి సాధిస్తూ వచ్చాడు ఆ ప్రగతి ఫలితాన్ని అనుభవిస్తున్నది ఎవరు?' అనే ప్రశ్నకు నాకు సమాధానం దొరికింది

నా చూపులు ఆ బిచ్చగాణ్ణి వెతుకుతున్నాయి అల్లంత దూరాన అతడు కనబడ్డాడు చరచర అడుగులు వేస్తున్నాను. కేక వేసి అపుదామనుకున్నా కాని ఏమని సంబోదించాలో అర్థం కావటం లేదు అతడి పేరేమిటో తల్లితండ్రులతోనే పోయింటుంది ప్రపంచానికి అతడు బిచ్చగాడు మాత్రమే

అతడు అప్పటికి మరో స్థావరం వెదుక్కున్నాడు అక్కడ కూర్చుని తన పని తాను చేసుకుపోతున్నాడు అది చూసి నేను చలించిపోయాను గుండెల్లో కెలికినట్లుంది

అతను చేస్తున్న పని సర్వ సాధారణంగా ప్రతి మనిషీ ఎప్పుడో ఒకప్పుడు చూసే వుంటాడు అలా చూసినప్పుడు కొందరు స్పందిస్తారు మరి కొందరు అతి మామూలుగా ఏమీ పట్టనట్టే వుండిపోతారు రాత్రి ఎవరో పారేసిన ఎంగిలి ఆకులు చెత్తకుండి లోంచి పెళ్లగించి తీస్తున్నాడు అతని చుట్టూ నాలుగైదు కుక్కలు చేరాయి

నేను సాటి మనిషిగా నా పని చేశాను అతడు చేస్తున్న పని ఒక క్షణం ఆపి నా వంక చూశాడు చూపులో ఏదో ఓ మెరుపు మెరిసినట్టయింది దాని పేరు కృతజ్ఞత కావచ్చు

నేనిచ్చిన కండువా, కాస్తంత చిల్లర ఓ పెన్నిధి లాగా అతనికి అనిపించినట్లుంది తన రెండు చేతుల్లో జాగ్రత్తగా అతడు పొదివి పట్టుకున్నాడు

ఇది జరిగి చాలా రోజులయింది కాని, ఆ బిచ్చగాడి కళ్లలో ఆ క్షణంలో మెరిసిన కృతజ్ఞతా భావం ఇప్పటికీ నన్ను వెన్నాడుతున్నట్టే అనిపిస్తుంటుంది □

# జ్ఞాపకాలు

జ్ఞాపకాల గాయాలను కెలుక్కు
మానని పుండ్లయి బాధ పెడతాయి
సుప్త భుజంగాల ముందు
నాదస్వరం ఊదకు
పడగ లెత్తిన కలలు
నా మనసునే కాటేస్తాయి
కలల్ని మనసు
అరలలో దాచి
జ్ఞాపకాలపై మరుపును
లేపనంగా పూసి
బ్రతుకుతున్నా యాంత్రికంగా
చీకటి ముసుగులో
వేదన ఒడిలో

–నందం రామారావు